వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 048
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జనవరి 30, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## భద్రకాళిని దర్శించిన మాధవానంద సరస్వతీ స్వామి

- పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు
- స్నపన మండపంలో అనుగ్రహ భాషణం

6లో..



# సమ్మక్కా.. సల్లంగసూడు

## జనసంద్రమైన మేడారం

- మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ
- పస్రాలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- తల్లుల దర్శనానికి తరలివచ్చిన గవర్నర్ దంపతులు
- వనదేవతలకు ప్రణమిల్లుతున్న భక్తులు

మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క–సారలమ్మ మహాజాతర మూడో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగుతోంది. ప్రధాన దేవతలు గద్దెలనెక్కడంతో తమ ఇలవేల్పును దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో మేడారం జనసంద్రంగా మారింది. తమను కంటికిరెప్పలా కాపాడుతున్న తల్లులను తనివితీరా చూసి, మొక్కులు చెల్లించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. దీంతో క్యూలైన్లు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటలతరబడి క్యూ లైన్ లోనే నిరీక్షించాల్సి వచ్చింది. వనదేవతలకు భక్తులు ప్రణమిల్లారు. సమ్మక్కా సల్లంగసూడు అంటూ వేడుకున్నారు. సమ్మక్క–సారక్క నామస్మరణతో మేడారం ప్రతిధ్వనించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాలనుంచి కూడా భక్తులు తరలి రావడంతో దారులన్నీ మేడారం వైపే అన్నట్లుగా సాగింది. దీంతో పస్రా ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులతోపాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, బండారు దత్తాత్రేయ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ దంపతులు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తోపాటు పలువురు ప్రముఖులు తల్లులను దర్శించుకున్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రావు, కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అక్కడే మకాంవేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

–వరంగల్ వాయిస్, మేడారం

వివరాలు2,8లో..





6లో..

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఇద్దరు యువకుల వేధింపులే కారణం
- విచారణ చేపట్టిన పోలీసులు



# సమ్మక్కా... సల్లంగసూడు



- జనసంద్రమైన మేడారం
- మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ
- పస్రాలో కిలోమీటర్లమేర ట్రాఫిక్ జామ్
- తల్లుల దర్శనానికి తరలివచ్చిన గవర్నర్ దంపతులు
- వనదేవతలకు ప్రణమిల్లుతున్న భక్తులు

**వరంగల్ వాయిస్, మేడారం :** వన దేవతల దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తులు భారీగా తరలిరావడంతో క్యూలైన్లు నిండి పోయాయి. క్యూ లైన్ల అవతల కూడా కిలో మీటర్ మేర భక్తులు నిలిచిపోయారు. క్యూలైన్ లోనే గంటలతరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. భక్తుల రద్దీని నియంత్రించడం పోలీసులకు సవాల్ గా మారింది. ఆసియాలోనే అతి పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఈ వేడుకను చూసి తరించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలనుంచి భారీ సంఖ్యలో తరలిరావడంతో వనమంతా జన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో శివసత్తుల పూనకాలు అత్యంత ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పసుపు దుస్తులు ధరించి, పూనకాలతో ఊగిపోయారు.

### వన దేవతలను దర్శించుకున్న ప్రముఖులు..

మేడారం సమ్మక్క–సారలమ్మలను గవర్నర్ విష్ణు దేవ్ వర్మ దంపతులు దర్శించుకున్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం ఎండోమెంట్ అధికారులు, పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా తులాభారం నిర్వహించి నిలువెత్తు బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం మంత్రి సీతక్క గవర్నర్ ను శాలువాతో సత్కరించి, అమ్మవార్ల ప్రసాదాన్ని అందజేశారు. జాతరలో భక్తుల సందడి నెలకొంది. అదే విధంగా రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు దనసరి అనసూయ కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ సైతం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్, భూపాల్ పల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు మేడారంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేసిన ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై చంద్రశేఖర్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి మేడారం సమ్మక్క–సారలమ్మలను కుటుంబ సమేతముగా దర్శించుకున్నారు. అశేష భక్తజనవాహిని నడుమ, ఆ తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని మనసారా వేడుకున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన మేడారం జాతర విశిష్టతను ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి కొనియాడారు. డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

### బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్..

సమ్మక్క–సారలమ్మల ఖ్యాతి ప్రపంచవ్యాప్తమైంది. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ వుమెన్ శుక్రవారం అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద జరిగిన నూతన కట్టడాలు, అభివృద్ధి గురించి అందులోని విశేషాలను మంత్రి సీతక్క బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ కు వివరించారు. ఈ జాతరకు విదేశీయులు సైతం తరలిరావడం అత్యంత ప్రాముఖ్యం సంతరించుకుంది.

### దేశం నలుమూలల నుంచి..

మేడారం సమ్మక్క–జాతరను తనివితీరా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా అటు చత్తీస్ గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించిన తనంతరం అమ్మవార్లను దర్శించుకొని ఎత్తు బంగారం, చీర సారెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు రాకతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.















# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

**• మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా**



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల రణక్షేత్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇస్తూ బీఆర్ఎస్‌లోకి చేరికల ఉప్పెన కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, స్వతంత్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ధర్మారెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆయన మాట్లాడుతూ.. "రెండేళ్లు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేని చేతగాని స్థితిలో కాంగ్రెస్ ఉంది. ప్రజలపై పన్నుల భారం వేస్తూ, మున్సిపాలిటీలను దోచుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు తుది విచారణ లాంటివి" అని హెచ్చరించారు. పరకాల గడ్డపై బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇదే వేదికపై 10వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా పిట్ట స్వప్న దేవేందర్ పేరును చల్లా ధర్మారెడ్డి అధికారికంగా ప్రకటించారు. ప్రజా బలం తమకే ఉందని, ఈ వార్డులో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న వారిలో ఆదరసాండి శ్యామ్, పిట్ట స్వప్న, పిట్ట దేవేందర్, కనుకుంట్ల రఘు, రాసమల్ల సతీష్, బి.నరేష్, మామిడి హరీష్, ఏ.శ్రవణ్ కుమార్, పిట్ట సునీల్, పి.సందీప్, కే.సతీష్, టి.రమేష్, ఎం.శ్రీనివాస్, కే.శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కనులకు కట్టినట్లు గాంధీజీ హత్యోదంతం



**వరంగల్ వాయిస్, నడికూడ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటకం అందరినీ ఆలోచింపజేస్తోంది. గాంధీజీ జీవితంలోని చివరి ఘట్టాన్ని (హత్యోదంతాన్ని) విద్యార్థులు అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శించి నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ చారిత్రక ఘట్టాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. కేవలం పుస్తకాల్లో చదువుకోవడమే కాకుండా, ఆనాటి భీకర సంఘటనను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో చరిత్రపై అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. ఈ నాటకంలో విద్యార్థులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. మహాత్మా గాంధీగా విద్యార్థి నేహాల్ ఆనంద్ తన నటనతో శాంతిదూతను స్మరింపజేశాడు. నాథూరామ్ గాడ్సేగా దయ్యాల వరుణ్ కుమార్ గాడ్సే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ఆకట్టుకున్నాడు. ఇతర విద్యార్థులు సైతం ఈ నాటకీకరణలో ఉత్సాహంగా పాల్గొని నాటక విజయానికి తోడ్పడ్డారు. విద్యార్థులు ప్రదర్శించిన ఈ నాటకానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చిన్నారులు ఇంత గొప్పగా, భావోద్వేగంతో ప్రదర్శన ఇవ్వడం పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "విద్యార్థుల నటన అద్భుతంగా ఉంది.. చరిత్రను అర్థవంతంగా వివరించారు" అంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# చేనేత కార్మికురాలు కమలమ్మ మృతి బాధాకరం

**తాటిపాముల వెంకట్రాములు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తవాడకు చెందిన చేనేత కార్మికురాలు దుస్స కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందడం చేనేత రంగానికి, ఆ కుటుంబానికి తీరని లోటు అని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలిసి మృతురాలి నివాసాన్ని సందర్శించి, కమలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. కమలమ్మ భర్త దుస్స రామయ్య గతంలో చేనేత కార్మిక సంఘం నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేసి, కార్మికుల సమస్యల కోసం పోరాడారని గుర్తు చేసుకున్నారు. 15 ఏళ్ల క్రితం ఆయన చనిపోయినప్పటికీ, కమలమ్మ చేనేత పని చేస్తూనే కుటుంబాన్ని ధైర్యంగా పోషించిందని కొనియాడారు. అటువంటి శ్రామిక మహిళ అనారోగ్యంతో కన్నుమూయడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వం స్పందించి నిరుపేద చేనేత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. అనంతరం కమలమ్మ కుమారుడు సురేష్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శించిన వారిలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగబత్తిని యాదగిరి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కూచన సారయ్య, గుండ రమేష్ తదితరులు ఉన్నారు.

# గిరిజన సంస్కృతికి మేడారం ప్రతీక

**మాజీ ఎమ్మెల్యే నరేందర్**



**వరంగల్ వాయిస్, శివనగర్ :** వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే, గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ నన్నపునేని నరేందర్ తన అనుచరులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు బయలుదేరారు. నియోజకవర్గంలోని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయన వెంట తరలివెళ్లారు. మేడారం బయలుదేరే ముందు నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్యదైవాలైన వనదేవతలను దర్శించుకుని, వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ మేలు జరగాలని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నియోజకవర్గ అభివృద్ధే ఏకైక లక్ష్యంగా తమ ప్రయాణం సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. "మేడారం జాతర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, అది గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం. లక్షలాది మంది భక్తుల ఐక్యతను, భక్తి భావాన్ని చాటే గొప్ప సందర్భమిది" అని నరేందర్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి శ్రేయస్సుకు తాము నిరంతరం కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయ సాధనే కాంగ్రెస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్ స్టేషన్ రోడ్ వద్ద గాంధీజీ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొండా మురళీధర్ రావు, కొండా సురేఖల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్రం కోసం దేశమంతటా పర్యటించి, ప్రజలందరినీ ఐక్యం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని కొనియాడారు. అహింసా మార్గంలో పోరాటం చేస్తూ, నిరాహార దీక్షలతో ఆంగ్లేయులను గడగడలాడించిన గాంధీజీ త్యాగాలను భారతీయులు ఎన్నటికీ మరువలేరన్నారు. మహాత్ముని ఆశయాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరి దగ్గరకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీజీ కలలుగన్న శాంతియుత సమాజం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, మంద శ్రీనివాస్, పోలెపాక విశాల్ బాబు, పోలెపాక యాకూబ్, ఎండీ తైమూర్, కంచ వేణు, దౌడు నాగరాజ్, ప్రవీణ్ రాజు, గోవర్ధన్, రమేష్ పాల్గొన్నారు.

# లోక కల్యాణార్థం 'మహాలక్ష్మి శ్రీ చక్ర యజ్ఞం'

**1న టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహణ**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లోక కల్యాణార్థం, సర్వ మానవాళి శ్రేయస్సు కోసం హనుమకొండలో 'ఓమౌజయః మహాలక్ష్మి మహా గురు శ్రీ చక్ర యజ్ఞం' నిర్వహించ తలపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మహా ప్రేమావతార మూలాధి పరా స్వయంభు సద్గురు జై మహావిభో శ్రీ వారి దివ్య అనుగ్రహంతో, మాఘ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరగనుంది. ఫిబ్రవరి 01న సాయంత్రం 05:30 గంటల నుంచి 07:00 గంటల వరకు టీటీడీ కళ్యాణ మండపం (పబ్లిక్ గార్డెన్ ఎదురుగా), హనుమకొండలో నిర్వహించనున్నారు. ఓమౌజయ ఏకోపాసన మహాధర్మం సేవా సమితి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం నిర్వహించబడుతోంది. అత్యంత పవిత్రమైన ఈ శ్రీ చక్ర యజ్ఞంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని సభ్యులు కోరారు. యజ్ఞం పూర్తయిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సేవా సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# గుర్రంపేట జాతరలో కలెక్టర్ పూజలు

**• వనదేవతలకు 'బంగారం' సమర్పణ**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి మండల పరిధిలోని గుర్రంపేటలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ సమ్మక్క–సారలమ్మ 'మినీ మేడారం' జాతరను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. జాతర ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ పూజారులు, అధికారులు మర్యాదపూర్వకంగా మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కలెక్టర్‌కు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం జాతర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు పోటెత్తుతున్న భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తోపులాటలు జరగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని, భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసు, ఎంపీడీఓ తరుణ్ ప్రసాద్తో పాటు పలువురు అధికారులు, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శుక్రవారం, జనవరి 30, 2026

# వలసలతో బీజేపీకి నష్టమేమీ లేదు

**పార్టీ మారిన వారు పది మంది లోపే**

**రానున్నది బీజేపీ ప్రభుత్వమే**

**యువమోర్చా మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలో బీజేపీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్తున్న వారి వల్ల పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల మండలంలో కొందరు నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న నేపథ్యంలో ఆయన శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీని వీడిన వారి సంఖ్య కేవలం పది మంది లోపే ఉంటుందని, ఆ కొద్దిమంది వెళ్లినంత మాత్రాన మండలంలో బీజేపీ బలహీనపడదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ. ఇదొక మహా సముద్రం లాంటిది. ఇలాంటి పార్టీలోకి నాయకులు వస్తుంటారు, పోతుంటారు. అంతమాత్రాన పార్టీ ప్రతిష్టకు భంగం కలగదు" అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అటువంటి పార్టీలో పని చేసే అవకాశం రావడమే ఒక అదృష్టమని సంతోష్ కుమార్ అన్నారు. బీజేపీ సిద్ధాంతాలను నమ్మి పనిచేసే కార్యకర్తలు గట్టిగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# జిల్లాలో 'ప్రజావాణి' తాత్కాలిక రద్దు

**మున్సిపల్ ఎన్నికల ముగిసే వరకు విరామం**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం ప్రస్తుతం పురపాలక ఎన్నికల పనుల్లో తలమునకలై ఉందని, ఈ క్రమంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం వీలుపడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగా ముగిసిన తర్వాత, తిరిగి యథావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు, అర్జీదారులు ఈ మార్పును గమనించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సోమవారం కలెక్టరేట్‌కు ఎవరూ రావద్దని సూచించారు.

# గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ నిరంతరం ఆదర్శంగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శాయంపేట మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింస అనే ఆయుధాలతో కోట్ల మంది ప్రజలను ఏకం చేసి, దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన బోధించిన శాంతి, సేవా గుణాలను ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. స్వదేశీ నినాదం, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన మరియు గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ కలలను సాకారం చేసేందుకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, మస్కే కుమారస్వామి, మారపెల్లి వరద రాజు, డిటి రెడ్డి, మార్కండేయ, రఫీ, దామెరకొండ కొమురయ్య, సుదర్శన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తిన మినీ మేడారం



- **భక్తజన సంద్రమైన అగ్రంపాడు..**
- **వనదేవతల దర్శనానికి బారులు తీరిన భక్తులు**
- **మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి**

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రెండో మేడారంగా ప్రసిద్ధి గాంచిన అగ్రంపాడు సమ్మక్క–సారలమ్మ జాతర జనసంద్రమైంది. తల్లీబిడ్డలైన వనదేవతలు గద్దెపై కొలువుతీరడంతో శుక్రవారం భక్తుల రద్దీ పతాక స్థాయికి చేరుకుంది. అగ్రంపాడు పరిసరాలన్నీ 'అమ్మవారి' నామస్మరణతో మార్మోగిపోతున్నాయి. సమ్మక్క–



సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు కిలోమీటర్ల మేర క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులు తమ ఆరాధ్య దైవాలకు నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు–కుంకుమలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా తలనీలాలు సమర్పించి, తమ కోరికలు నెరవేర్చాలని వనదేవతలను వేడుకున్నారు. గొర్రెపోతుల బలులు, కొబ్బరికాయల నైవేద్యాలతో జాతర ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

**అమ్మవార్ల సన్నిధిలో సిరికొండ ..**

మాజీ శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శుక్రవారం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిలుగా వనదేవతలపై భక్తులకు అచంచలమైన విశ్వాసం ఉందన్నారు. గిరిజన సంస్కృతికి అద్దం పట్టే ఈ జాతరలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**పకడ్బందీ ఏర్పాట్లు..**

జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సుధాకర్ రెడ్డి, జాతర చైర్మన్ వంచ రంగారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు, సీఐ ఆర్. సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తూ, క్యూలైన్లను క్రమబద్ధీకరిస్తున్నారు. అగ్రంపాడు సర్పంచ్ గంగుల మహేందర్, మాజీ చైర్మన్ బోరింగ్ స్వామి తదితరులు జాతర విజయవంతానికి కృషి చేస్తున్నారు.



# మేడారంలో జంగా రాఘవరెడ్డి

**కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం**



**వరంగల్ వాయిస్, మేడారం :** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకున్న ఆయనకు పూజారులు సాదర స్వాగతం పలికారు. అశేష భక్తజనవాహిని నడుమ జంగా రాఘవరెడ్డి వనదేవతలకు 'బంగారం' (బెల్లం) సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆ తల్లుల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా వేడుకున్నట్లు తెలిపారు. మేడారం జాతర ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు గొప్ప ప్రతీక అని ఆయన కొనియాడారు. భక్తికి, త్యాగానికి నిదర్శనమైన ఈ మహోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, సమ్మక్క–సారలమ్మల కృపతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. జంగా రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నోటీసుల జారీ పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని రాజేశ్వర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పంతాలకు పోయి ప్రతిపక్ష నాయకులను వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. తప్పుడు నోటీసులతో కేసీఆర్‌ని, పార్టీని భయపెట్టలేరు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, సరైన సమయంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారు" అని ఆయన హెచ్చరించారు. అక్రమ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని రాజేశ్వర్ రావు స్పష్టం చేశారు.

# మేడారంలో 'ఐఎంఏ' వైద్య సేవలు భేష్!

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో భక్తుల సౌకర్యార్థం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయంగా సాగుతున్నాయి. గత ఐదు రోజులుగా గద్దెల పరిసరాల్లో ఐఎంఏ వైద్య బృందం నిరంతరం వైద్య సేవలు అందిస్తోందని ఐఎంఏ జాతీయ హాస్పిటల్ బోర్డు కమిటీ సభ్యులు డాక్టర్ బందెల మోహన్ రావు తెలిపారు. మేడారం గద్దెల వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన 50 పడకల ఆసుపత్రిలో ఐఎంఏ భాగస్వామ్యంతో వైద్య సేవలు అందుతున్నాయి. వరంగల్ ఐఎంఏ నుంచి ప్రతిరోజూ 15 మంది వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్లు జాతర విధుల్లో పాల్గొంటున్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రధానంగా డాక్టర్ శిరీష్ (ఆర్థోపెడిక్), డాక్టర్ రాజ్ కుమార్ (నేత్ర వైద్యులు), డాక్టర్ పరమేశ్వర్ (నేత్ర వైద్యులు), డాక్టర్ రణధీర్ వంటి నిపుణులు భక్తులకు చికిత్స అందిస్తున్నారు. ములుగు డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు, వరంగల్



డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు ఈ సేవా కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వైద్య నిపుణులతో పాటు పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది ఈ మహా జాతరలో భక్తుల ఆరోగ్య రక్షణ కోసం శ్రమిస్తున్నారని డాక్టర్ మోహన్ రావు పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తక్షణ వైద్య సాయం అందించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

5
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, జనవరి 30, 2026

# నర్సంపేట మున్సిపాలిటీలో 'కమలం' జోరు

- 30 వార్డుల్లో బీజేపీ నామినేషన్లు
- హాజరైన గంట రవికుమార్, రాణా ప్రతాప్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట మున్సిపల్ ఎన్నికల పోరు క్లైమాక్స్‌కు చేరుకుంది. నామినేషన్ల పర్వం చివరి రోజైన శుక్రవారం భారతీయ జనతా పార్టీ తన సత్తా చాటుతూ మొత్తం 30 వార్డుల్లో తమ అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించింది. వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, కంటెస్టెడ్ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు కలిసి అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసి, నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి



చేయాలంటే అది ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అదే అభివృద్ధి ఫలాలు స్థానికంగా అందాలంటే మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో ప్రధానంగా నెలకొన్న సమస్యలైన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ప్రణాళిక, అవినీతి రహిత పాలన అందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ అభ్యర్థులందరూ ఐక్యంగా పనిచేసి ఘనవిజయం సాధించాలని, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని గంట రవికుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహా రాములు, జిల్లా ఉపాధ్యక్షులు రే శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, జిల్లా ఇన్చార్జీలు, పదాధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మల్లూర్ మండలంలోని తాడిచెర్ల గ్రామంలో శుక్రవారం నివాళులర్పించే కార్యక్రమం ఘనంగా జరిగింది. వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ అనుసరించిన అహింసా మార్గం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శాంతి, సత్యం అనే ఆయుధాలతో దేశానికి స్వేచ్ఛను ప్రసాదించిన మహనీయుడు గాంధీజీ అని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లూర్ ఎంపీడీఓ క్రాంతి కుమార్ పాల్గొని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయనతో పాటు వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గాంధీ మార్గం ఆదర్శనీయం



**వరంగల్ వాయిస్, గణపురం :** అహింసా మార్గంతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి పెట్టిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం చెల్పూర్ బస్టాండ్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ ఉపసర్పంచ్ పోనగంటి మలహాల్ రావు, 14వ వార్డు సభ్యురాలు రూపిరెడ్డి సులోచన-రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త పద్మ-వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బైరగొని సరిత-తిరుపతి తదితరులు పాల్గొని బాపూజీకి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన శాంతి, సత్యం, అహింస అనే సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయితు రమేష్, అడ్డురి శ్రీధర్ రావు, కారబర్ పొన్నం రఘు, 4వ వార్డు సభ్యుడు ఎండీ.అంజద్ పాషా, వేముల వంశీ తదితరులు పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు.

# 'రేగురి కరుణ' నామినేషన్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగుతోంది. ఈ క్రమంలో పట్టణంలోని 18వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రేగురి కరుణ శుక్రవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలతో కలిసి భారీ సంఖ్యలో తరలివచ్చి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. 18వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రేగురి కరుణ ఎల్లప్పుడూ ముందుంటారని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు కరుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నామినేషన్ అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు వార్డులో జోరుగా ప్రచారం నిర్వహించాయి. పరకాల పట్టణ ముఖచిత్రాన్ని మార్చే శక్తి కేవలం బీఆర్ఎస్ పార్టీకే ఉందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏకు శుభాష్, పార్టీ ముఖ్య నేతలు, వార్డు కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# మహిళా కానిస్టేబుల్ భౌతిక దేహానికి ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రామావత్ అనిత భౌతిక దేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం నివాళులర్పించారు. పర్వతగిరి మండలం సీత్యతండాలోని అనిత నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. చిన్న వయసులోనే మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అనిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం మరియు పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటన తండాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, స్థానిక సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ హేమ్లా నాయక్, సర్పంచ్లు చిటూరి శంకర్, గాడిపెల్లి మహేందర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

# పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జంతు సంక్షేమ పక్షోత్సవాలను పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. శుక్రవారం కరీమాబాద్‌లో రంగశాయిపేట పశువైద్యాధికారిణి డాక్టర్ బి.ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన పెంపుడు కుక్కల ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ.. యజమానులు తమ ఇళ్లలో పెంచుకునే జంతువులు ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్‌లను అందజేస్తోందన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ పెంపుడు జంతువుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జంతువుల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని, తగిన చికిత్సతో పాటు అవసరమైన సూచనలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని పలు పెంపుడు కుక్కలకు సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. పశువైద్య సిబ్బంది హసీనా బేగం, వీరమ్మ, వినయ్, వెంకన్న, మధు కుమార్ పాల్గొన్నారు.

# భారీగా నకిలీ టీ పొడి పట్టివేత

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రజారోగ్యంతో ఆటలాడుకుంటున్న నకిలీ టీ పొడి ముఠా గుట్టును అధికారులు రట్టు చేశారు. శుక్రవారం గూడెప్పాడ్ సెంటర్ సమీపంలోని ఎం.ఎం మార్ట్ లో వరంగల్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 40 కిలోల నకిలీ టీ పొడిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు కృష్ణమూర్తి, మౌనిక స్థానికులకు, వినియోగదారులకు నకిలీ టీ పొడిని గుర్తించే విధానంపై ప్రత్యక్షంగా డెమో ఇచ్చారు. సాధారణ నీటిలో టీ పొడి వేసినప్పుడు, అది వెంటనే రంగును విడిచిపెడితే అది కల్తీ టీ పొడిగా భావించాలని తెలిపారు. సహజమైన టీ పొడి వేడి నీటిలో మరిగించినప్పుడు మాత్రమే రంగును సంతరించుకుంటుందని వివరించారు. హెయిర్ డ్రై లాంటి కృత్రిమ రంగులు కలిపిన టీ పొడి వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అనంతరం పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ.. నిబంధనలు



అతిక్రమించి నకిలీ వస్తువులను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట ఎస్సై పరమేశ్వర్, దామెర ఎస్సై కొంక అశోక్, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, శాయంపేట సర్కిల్ పోలీస్ బృందం పాల్గొన్నారు.

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**ఇద్దరు యువకుల వేధింపులే కారణం**



**వరంగల్ వాయిస్, క్రైం :** ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్ కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు.. నన్ను వేధించారు.. అవమానించారు.. మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్ లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# రఘునందన్ రావుకు ఘనస్వాగతం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్టీ చీఫ్ కమిషనర్ రఘునందన్ రావును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద ఆయనకు పర్యావరణ హితంగా ఒక మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలోని వివిధ పరిపాలనా అంశాలు మరియు ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై వారు క్లుప్తంగా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, బీజేపీ పార్టీ ప్రతినిధి హరి శంకర్, అధికారులు పాల్గొన్నారు.

# దేవదాస్‌ను పరామర్శించిన సర్పంచ్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** చెన్నారావుపేట కాలనీ గ్రామ పెద్ద బర్ల దేవదాస్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఇటీవలే ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న దేవదాస్‌ను వారి నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కంది శ్వేత మాట్లాడుతూ.. ఆరోగ్య విషయంలో ఎటువంటి ఆందోళన చెందవద్దని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ జెంగిలి రాజు, బర్ల అరుణతో పాటు బీఆర్ఎస్ నాయకులు నర్మెట సాంబయ్య, సాదు నర్సింగరావు, జెంగిలి ఏషోబు, పందిర్ల రాజేందర్, మందుల సాగర్, బారేపాక నవీన్, జెంగిలి రాజేష్, ఆకులపెల్లి సుదర్శన్, చాతల్ల సంజీవ పాల్గొన్నారు.

# ఎన్నికలు పారదర్శకంగా జరగాలి



- రాజకీయ పార్టీలు సహకరించాలి
- కలెక్టర్ సత్య శారద
- మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాబోయే పురపాలక ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. జిల్లాలోని నర్సంపేట (30 వార్డులు), వర్ధన్నపేట (12 వార్డులు) మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ధనబలాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కఠినమైన విధివిధానాలను కలెక్టర్ వివరించారు. మున్సిపల్ వార్డులో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి గరిష్టంగా రూ. లక్ష మాత్రమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే మైకులు, కుర్చీలు, వాహనాలు, ఫ్లెక్సీలు ఇతర సామగ్రికి సంబంధించిన ధరల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి ఖరారు చేశారు. అభ్యర్థులు చేసే ప్రతి రూపాయి ఖర్చును నిర్ణీత రిజిస్టర్లలో నమోదు చేయాలని, నిర్ణీత గడువులోగా అధికారులకు లెక్కలు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రలోభాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత పార్టీలపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ఈ ఎన్నికల ప్రక్రియ అంతా వీడియో గ్రాఫీ కింద పర్యవేక్షించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీవో కల్పనలతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు హరిశంకర్ (బీఎస్పీ), రజినీకాంత్ (వైఎస్సార్‌సీపీ), అనిల్ కుమార్ (బీఎస్పీ), సయ్యద్ ఫైజుల్లా (ఏఐఎంఐఎం) తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

- తొగుట పీఠాధీశ్వరుల సందర్శన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు మహానగర ఆరాధ్య దైవం శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని శుక్రవారం ఉదయం తొగుట పీఠాధీశ్వరులు శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఆలయ ఈ.ఓ. రామల సునీత, ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారు అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ స్నపన మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ.. భద్రకాళీ అమ్మవారి విశిష్టతను, ఆధ్యాత్మిక మార్గంలోని గొప్పతనాన్ని వివరించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. శుక్రవారం పర్వదినం సందర్భంగా భక్తురాలు శ్రీమతి పుట్టంరెడ్డి దీప్తిరెడ్డి అమ్మవారికి బహుకరించిన సుమారు 111 కిలోల సర్వాంగ వెండి కవచం, మాంగళ్యాలను అభిషేకం అనంతరం అమ్మవారికి అలంకరించారు. ధగధగమెరిసే వెండి కవచాల అలంకారంలో భద్రకాళీ మాత భక్తులకు కనువిందు చేశారు. ఈ అపురూపమైన అలంకారాన్ని దర్శించుకున్న భక్తులు అమ్మవారి దివ్యరూపాన్ని చూసి పరవశించిపోయారు. అమ్మవారికి అత్యంత విలువైన వెండి ఆభరణాలను బహుకరించిన దాత శ్రీమతి పుట్టంరెడ్డి దీప్తిరెడ్డిని దేవస్థానం తరపున ధర్మకర్తలు మరియు ఈ.ఓ. ఘనంగా సన్మానించారు. వారికి శేషవస్త్రాలను బహుకరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి రామేశ్వర్ రావు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, తొనుపునూరి వీరన్న, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బల్దియాలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

- ఫైళ్ల నిర్వహణపై చాహాత్ బాజ్‌పాయ్ ఆరా
- వివిధ విభాగాల పనితీరు పరిశీలన
- విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయ్ శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని వివిధ విభాగాల స్థితిగతులను, సిబ్బంది హాజరును, ఫైళ్ల నిర్వహణ తీరును ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రధాన కార్యాలయ నియో భవనంలోని పలు విభాగాలను సందర్శించిన కమిషనర్, అక్కడ జరుగుతున్న



పనులపై అధికారులతో చర్చించారు. ఐసీసీసీ, అకౌంట్స్, ఐటీ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లను తనిఖీ చేశారు. టౌన్ ప్లానింగ్ దస్త్రాలు భద్రపరిచే గదిని, ఇంజనీరింగ్ రికార్డ్ సెక్షన్‌ను సందర్శించి ఫైళ్ల క్రమబద్ధీకరణపై ఆరా తీశారు. వెటర్నరీ, పోస్ట్ ఆడిట్, హార్టికల్చర్ విభాగాలను పరిశీలించి సిబ్బంది విధులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గదుల పరిశుభ్రతపై కూడా ఆమె ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో కమిషనర్ వెంట సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సూపరిండెంట్ ఆనంద్, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.



# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ

# ప్రతి ఇంట్లో కనిపించే కథ..'ఓం శాంతి శాంతి శాంతిః'



'ఓం శాంతి శాంతి శాంతిః' మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహేకి రీమేక్ ఇది. బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లూ ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గ□హ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్ధం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావ□తం అయినట్టుగా అనిపిస్తాయి. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ ఒదిగిపోయిన తీరు మెప్పిస్తుంది. ఆయన గోదావరి యాస పలికిన విధానం కూడా బాగుంది. భార్య తిరగబడేంత వరకూ ఒకలా కనిపించిన తరుణ్, భార్య చేతిలో తన్నులు తినప్పట్నుంచి ఆయన ప్రదర్శించిన నటన, హావభావాలు మరో స్థాయిలో ఉంటాయి. శాంతి పాత్రలో ఈషా రెబ్బా నటన ఈ సినిమాకి హైలైట్. ప్రథమార్ధంలో కళ్లతోనే భావాలు పలికిస్తూ పాత్రని పండించింది. భర్తని ఎదిరిస్తూ చేసే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. బ్రహ్మాజీతోపాటు ఇతర నటులు పాత్రల పరిధి మేరకు మంచి అభినయం ప్రదర్శించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. దర్శకుడు గోదావరి నేపథ్యాన్ని తెరపై చూపిస్తూ కథని చెప్పిన తీరు, నందకిశోర్ సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి.



# అమెజాన్‌లోకి నారీ నారీ నడుమ మురారి

సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ □ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి □స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ వి□డియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్ , హీరోయిన్లుగా సాక్షీ వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు.

# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?

ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై ద□ష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

































EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com